సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



టెంపుల్ జాగా.. ప్రైవేట్‌పరం దిశగా
రాష్ట్రంలో ఏపీటీడీసీ యూనిట్లను ప్రైవేటీకరించడంతో శ్రీవారి కొండపై ఉన్న హరిత హోటల్, అది ఉన్న భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనుంది. 8లో ▸



పలు కేసుల్లో నిందితుల అరెస్ట్
ఏలూరు జిల్లావ్యాప్తంగా పలు కేసులను పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. 8లో ▸



పనులు లేక స్వర్ణకారులు విలవిల
బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతుంటే.. ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸

పేద బతుకులకు లేదు ధీమా

మోగల్లుకు చెందిన 41 ఏళ్ల వెంకటరత్నం వ్యవసాయ కూలీగా పనిచేసేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం పొలంలో పురుగు మందులు పిచికారీ చేసే పనికి వెళ్లి మృతి చెందాడు. వెంకటరత్నం మృతితో భార్యాపిల్లలు దిక్కులేనివారయ్యారు. భార్య పనికి వెళుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి బీమా సాయం అందలేదు. భార్యకు కనీసం వితంతు పింఛన్ కూడా మంజూరు కాలేదు.

పెన్నాడకు చెందిన ఒక యువకుడు అనారోగ్యంతో ఏడాది క్రితం మృతిచెందాడు. ఆయనకు భార్యాపిల్లలు ఉన్నారు. ఆయన భార్య స్థానికంగా క్లాత్ షాపులో పనిచేస్తూ పిల్లల్ని పోషించుకుంటోంది. ప్రభుత్వం నుంచి బీమా పరిహారం కాని, పింఛన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

చంద్రన్న బీమా అమలెప్పుడో..!
- ఆపద వేళ ఆదుకోని కూటమి సర్కారు
- పరిహారం రాదు.. పింఛన్ ఇవ్వరు
- జిల్లాలో ఇంటి యజమానిని కోల్పోయి దిక్కుతోచని పేద కుటుంబాలు ఎన్నో..
- గతంలో వైఎస్సార్ బీమాతో అండగా నిలిచిన జగన్ సర్కార్
- ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష సాయం
- భార్యకు వితంతు పింఛన్‌తో ఆసరా



సాక్షి, భీమవరం: బీమా సాయాన్ని రూ.10 లక్షలకు పెంచుతామంటూ ఎన్నికల్లో కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక హామీ అమలు చేయకపోగా అసలుకే ఎసరు పెట్టారు. ఇంటి యజమానిని కోల్పోయిన ఆపద వేళ ప్రభుత్వం నుంచి ఆపన్న హస్తం అందక జిల్లాలో ఎన్నో పేద కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఏడాదిగా పత్తాలేని బీమా
బీమా చెల్లింపులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. గతేడాది జూన్‌లో బీమా సంస్థతో మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) గడువు ముగియగా ప్రభుత్వం రెన్యూవల్ చేయకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. చంద్రన్న బీమా పథకం కింద రూ.10 లక్షలు సాయం అందిస్తామని, డ్వాక్రా సంఘాల ద్వారా ఈ పథకాన్ని పక్కాగా అమలు చేస్తామని, కార్మికులకే కాకుండా ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలు, ఇతర వర్గాలకు బీమాను వర్తింపజేయనున్నట్టు గతేడాది ఆగస్టులోనే సీఎం చంద్రబాబు ప్రకటించినా ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. ఏడాదిలో బీమా పరిహారానికి అర్హత కలిగిన కుటుంబాలు జిల్లాలో 500లకు పైనే ఉంటాయని అంచనా. వీరంతా ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

పింఛనూ లేదు : పేద కుటుంబాల్లో భర్త మృతి చెందితే భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. గత ప్రభుత్వంలో ఆరు నెలలకోసారి చొప్పున జనవరి, జూన్ నెలలో కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో వితంతు పింఛన్లు సకాలంలో అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంకా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. గతంలో పింఛన్ పొందుతూ ఎవరైనా మృతిచెందితే వారి భార్యలకు మాత్రమే ఇటీవల స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసింది. అటు బీమా సాయం అందక, ఇటు పింఛన్ రాక భర్త మృతితో ఎంతోమంది మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన కుటుంబాలకు బీమా సాయం, వితంతు పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.104 కోట్ల సాయం



బాధిత కుటుంబానికి బీమా పరిహారం అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి (ఫైల్)

దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో ఇంటి యజమాని మరణిస్తే ఆ కుటుంబానికి బీమా సాయంతో గత ప్రభుత్వం అండగా ఉండేది. ఈ మేరకు 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5 లక్షలు, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు సహజ మరణం పొందితే రూ.లక్ష చొప్పున పరిహారం అందించేవారు. పేద కుటుంబాల వారి పేరిట బీమా సంస్థకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించేది. ఇంటి యజమాని మృతిచెందితే సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబం వద్దకు వెళ్లి బీమా పథకం కోసం ఆన్‌లైన్ చేసేవారు. మట్టిఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగిలిన మొత్తాన్ని నిర్ణీత వ్యవధిలో నామినీ ఖాతాకు జమచేసేవారు. ఇలా బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచేవారు. ఈ సాయం భవిష్యత్ అవసరాలకు కొండంత భరోసా అయ్యేది. ఇలా వైఎస్సార్‌సీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలోని దాదాపు 6,999 కుటుంబాలకు రూ.104.35 కోట్ల పరిహారం అందించారు.

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా స్పోక్స్ పర్సన్ ముప్పిడి సంపత్ కుమార్ ఉన్నారు.

మిద్దె తోటల పెంపకానికి ప్రోత్సాహం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో హోమ్ కంపోస్ట్ తయారీ, మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో స్వచ్ఛాంధ్ర, వర్మీ కంపోస్ట్ తయారీ, మిద్దె తోటల పెంపకం, ఎస్‌టీపీలు, శానిటేషన్ డ్రైవ్‌పై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఆమె సమీక్షించారు. జిల్లాలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థ, పర్యాటకం, ఉపాధి, కేవీఐబీ అధికారులతో సమావేశమై పలు అంశాలపై ఆమె చర్చించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి కలెక్టర్‌కు వచ్చే ప్రతి దస్త్రం తప్పనిసరిగా ఈ-ఆఫీస్ ఫైల్ విధానంలో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు.

న్యూస్‌రీల్

గళమెత్తిన మున్సిపల్ కార్మికులు



భీమవరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. యూనియన్ నాయకులు ఎం.వైకుంఠరావు, బి.వరలక్ష్మి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా పట్టించుకోవడం లేదన్నారు. 12వ పీఆర్సీ కమిటీ నియామకం, కార్మికుల జీతాలు పెంపు, సమ్మె కాలానికి జీతాల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

లాటరీ విధానంలో బార్ల కేటాయింపు



లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని ఐదు బార్ల కేటాయింపునకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 15 బార్ల కేటాయింపు పూర్తయిందని, మిగిలిన 13 బార్లకు రెండో విడత గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా ఐదు బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో భీమవరం పరిధిలో నాలుగు, నరసాపురం పరిధిలో ఒక బార్‌కు ఒకే అభ్యర్థి నాలుగేసి దరఖాస్తులు వేయడంతో అతనికే ఏకగ్రీవంగా బార్లను కేటాయించినట్టు చెప్పారు. మిగిలిన తాడేపల్లిగూడెంలో నాలుగు, తణుకులో 3, నరసాపురంలో ఒక బార్‌కు మరోసారి నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి ప్రభుకుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ప్రసాద్‌రెడ్డి, అజయ్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు.

కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసనలు

భీమవరం(ప్రకాశం చౌక్): విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. భోజన విరామ సమయంలో జిల్లాలోని భీమవరం, తాడేపల్లి గూడెం, నరసాపురం డివిజన్లలోని ఉద్యోగులు నిరసన తెలిపి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద భీమవరం డివిజన్ జేఏసీ చైర్మన్ ఏఎస్ఎం కృష్ణమూర్తి, కన్వీనర్ ఎం.శ్రీనివాసరాజులు మాట్లాడుతూ జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్, రెగ్యులరైజేషన్, పనికి తగిన వేతనం, డీఏల మంజూరు, ఖాళీల భర్తీ, సబ్‌స్టేషన్లు కాంట్రాక్ట్ ఇవ్వడం నిలుపుదల వంటి 17 డిమాండ్ల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. శుక్రవారం సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని, 22న ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. కృష్ణంరాజు, జి.శ్రీకాంత్, వి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



భీమవరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సీపీఎం లంకపేటశాఖ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలిస్తామని కూటమి ప్రభుత్వం చేసిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. గతనెలలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసినా అధికారులు కనీసం విచారణ చేయకపోవడం దారుణమన్నారు. సొంతిల్లు లేక పేదలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సీహెచ్ వరలక్ష్మి, కొమరగిరి రమేష్, సాయమ్మ పాల్గొన్నారు.

యూరియాపై అదనపు వసూళ్లు

- బస్తాకు రూ.130 వరకు వసూలు
- కుక్కునూరు మండలంలో ఓ ఎరువుల వ్యాపారిపై ఆరోపణలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: యూరియా కొరతను ఆసరాగా చేసుకుని బస్తాపై అధికంగా వసూలు చేస్తున్న సంఘటన కుక్కునూరు మండలంలోని గణపవరం గ్రామంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. స్థానికంగా ఓ ఎరువుల వ్యాపారి గ్రామంలో కొందరు రైతుల నుంచి యూరియా బస్తాకు రూ.500 వసూలు చేశాడు. అలాగే యూరియా విక్రయించినప్పుడు రైతులతో థంబ్ కూడా వేయించుకోలేదు. వాస్తవంగా బస్తా ధర రూ.370 కాగా రూ.130 అదనంగా వసూలు చేసినట్టు రైతులు చెబుతున్నారు.

అధికార పార్టీ వారికే.. యూరియా అమ్మకంలో కూడా సదరు వ్యాపారి వివక్ష చూపించినట్టు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన రైతులకు మాత్రమే యూరియా విక్రయించాడని, అలాగే వారికి ఒక్కొక్కరికీ 15 బస్తాల వరకు ఇచ్చాడని అంటున్నారు. వరి సాగుచేస్తున్న వైఎస్సార్ సీపీకి చెందిన రైతులకు యూరియా ఇవ్వకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సరిదిద్దుకునే ప్రయత్నం : యూరియా అమ్మకంలో అదనంగా వసూలు చేసిన విషయం అధికారులకు తెలియడంతో సదరు వ్యాపారి సరిదిద్దుకునే ప్రయత్నం చేశాడు. గురువారం రైతుల వద్దకు వెళ్లి థంబ్ వేయించుకున్నట్టు తెలిసింది. అలాగే బస్తాకు అదనంగా తీసుకున్న రూ.130లను గ్రామంలో ఓ వ్యక్తి వద్దకు పంపిస్తానని చెప్పినట్టు సమాచారం. ఆరుగాలం శ్రమించే రైతులను దోచుకోవడం తగదని, అలాగే పార్టీ పేరుతో వివక్ష చూపడం దారుణమని స్థానికులు వాపోతున్నారు.

ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు



నేను ఎంతగానో బతిమిలాడితే ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు. అది కూడా రూ.500 వసూలు చేశారు. అదనపు వసూళ్లపై ప్రశ్నిస్తే యూరియా ఇవ్వడం లేదని తెలిసి నేను వ్యాపారి అడిగినంత చెల్లించాను. అలాగే మా గ్రామంలో అసలు వ్యవసాయం చేయని వారికి కూడా యూరియా బస్తాలు అమ్మారు. అధికార పార్టీకి చెందని చాలా మందికి యూరియా బస్తాలు ఇవ్వలేదు.
– కొత్తపల్లి రాంబాబు, రైతు, గణపవరం, కుక్కునూరు మండలం

పోలీసుల జోక్యం వీడాలి

జంగారెడ్డిగూడెం: పేదలు సాగు చేస్తున్న ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములకు రక్షణ కల్పించాలని స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యాగంటి సీత అధ్యక్షత వహించారు.

నేడు 'చలో దగ్గులూరు మెడికల్ కాలేజ్'

జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన



పాలకొల్లులో కరపత్రం విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో దగ్గులూరు మెడికల్ కాలేజీ జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో గుడాల గోపి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఉన్నా మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేస్తానంటే ఏమీ మాట్లాడకపోవడం దురదృష్టకరం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో పాలకొల్లుకు వచ్చిన వైద్య కళాశాలను నిలబెట్టుకోకుండా, ప్రైవేటుపరం చేస్తానన్న సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని ప్రశ్నించలేని దుస్థితిలో మంత్రి ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వనరులు తీసుకురాలేరు, ఉన్న వనరులను అభివృద్ధి చేయలేరని మరోసారి కూటమి నాయకులు నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్‌సీపీ గెలవకపోయినా నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ సీఎం జగన్ రూ.475 కోట్లతో పాలకొల్లు మండలం దగ్గులూరులో 60 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణానికి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. గతంలో పలుసార్లు మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరగడం లేదని రాద్ధాంతం చేసిన మంత్రి రామానాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం ఆయనకు ఇష్టంలేదనే అనుమానం కలుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యాక్రమానికి జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల తాతాజీ, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు సందీప్, బండి రమేష్, వీరా మల్లికార్జునుడు, రాజేష్, పాలపర్తి కృపానాథ్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు

నరసాపురం: దసరా, దీపావళి పండుగలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడానికి కసరత్తు చేస్తున్నట్టు రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్‌పాటిల్ తెలిపారు. గురువారం నరసాపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్‌లో 24 స్టేషన్లలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. చెన్నై-విజయవాడ వందేభారత్ రైలును నరసాపురం వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందని, దసరా నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ ట్రాక్ పనులు సాగుతున్నాయని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో వచ్చే యాత్రికుల సౌకర్యార్థం పలు స్టేషన్ల అభివృద్ధి, ప్రత్యేక రైళ్ల ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పారు. రైళ్లలో చోరీల నివారణకు చర్యలు చేపడతున్నామన్నారు. నరసాపురం స్టేషన్ మేనేజర్ మధుబాబు, విజయవాడ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



నరేంద్ర ఆనంద్ పాటిల్, రైల్వే డీఆర్ఎం

6 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

భీమవరం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్షించారు. త్వరలో మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశిస్తామని, వచ్చేనెల మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు క్విక్ రెస్పాన్స్ బృందాన్ని నియమిస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

తమ్మిలేరుకు భారీగా నీరు

చింతలపూడి: ఏలూరు జిల్లాతో పాటు ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. గురువారం అధికారులు 301 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.72 అడుగులకు, గోనెల వాగు బేసిన్ 347.45 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ లాజరుబాబు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 0.660 టీఎంసీలకు, గోనెల వాగు బేసిన్ 1.109 అడుగులకు చేరుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 637 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి వస్తుందన్నారు.

కూటమి నేతల కబ్జాల పర్వం

- రూ.కోటి విలువైన ఇరిగేషన్ భూమి ఆక్రమణ
- ప్రజాప్రతినిధి అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- చోద్యం చేస్తున్న ఇరిగేషన్ అధికారులు



కైకలూరు-కోరుకొల్లు రోడ్డులో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ భూమి



సిమెంట్‌తో కల్వర్టు నిర్మించి పూడ్చిన పంట బోదె

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కైకలూరు నియోజకవర్గంలో కూటమి నేతల కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రోడ్డు పక్కనే పబ్లిక్‌గా రూ.కోట్ల విలువైన భూములు స్వాధీనం చేసుకుంటున్నా అధికారులు నోరెత్తలేని పరిస్థితి. 'మా జోలికొచ్చారా..! పెద్దాయనకు చెబుతాం..' అంటూ కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో రాత్రి వేళ్లలో ప్రభుత్వ భూములను పూడ్చేస్తున్నా కన్నెత్తే సాహసం ఎవరూ చేయడం లేదు.

30 సెంట్లపై కన్ను : నియోజకవర్గంలో రూ.కోట్ల విలువైన ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ప్రభుత్వ పోరంబోకు భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో ఆక్వా చెరువుల ప్రాంతాల్లో ఇరిగేషన్ భూముల గట్లు రూపంలో కలిపేసుకున్నారు. తాజాగా కైకలూరు నుంచి కోరుకొల్లు రహదారిలో ఇటుకుల బట్టీల వద్ద 30 సెంట్ల ఇరిగేషన్ భూమిని కూటమి మద్దతుదారుడు ఆక్రమించుకున్నాడు. మార్కెట్‌లో ఈ భూమి విలువ సుమారు రూ.కోటి ఉంటుంది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వద్ద తన పబ్బం గడుపుకోడానికి ఇతరులపై చాడీలు చెప్పే అలవాటున్న వ్యక్తి ఈ ఆక్రమణలో కీలకంగా వ్యవహరించాడనే ఆరోపణలు ఉన్నాయి.

పక్కా పథకం ప్రకారం : రహదారి సమీపంలో ఇరిగేషన్ భూమి వెనుక అర ఎకరం పట్టా స్థలాన్ని కొందరు కొనుగోలు చేశారు. దీని ముందు ఇరిగేషన్ భూమి 30 సెంట్లు ఉంది. ఇరిగేషన్ భూమిలో పంట కాల్వ నుంచి వచ్చే నీటి బోదె ఉంది. ఈ బోదెను ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండానే సిమెంట్‌తో నిర్మించారు. ఆ పైన మట్టితో పూడ్చారు. ఇప్పుడు వెనుక కొనుగోలు చేసిన అర ఎకరం, ముందు ఇరిగేషన్ భూమి కలిపి ఒక ప్లాట్‌గా తయారయ్యింది. ఇరిగేషన్ అధికారులు ఇది జలవనరుల శాఖకు సంబంధించిన భూమి అని హెచ్చరిక బోర్డులు పెట్టడం, రాత్రికి అక్రమార్కులు వాటిని తీసిపడేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. మీడియా ప్రతినిధులు గురువారం పరిశీలనకు వెళ్లిన తర్వాత ఇరిగేషన్ అధికారులు యథావిధిగా హెచ్చరిక బోర్డులు మళ్లీ పెట్టడం గమనార్హం.

ఇరిగేషన్ సిబ్బందికి మొండిచేయి
ఇరిగేషన్‌శాఖలో చాలా ఏళ్లగా లస్కర్లు పనిచేస్తున్నారు. కైకలూరు కాల్వగట్టు కోరుకొల్లు రోడ్డులో 20 సెంట్ల ఇరిగేషన్ భూమిలో క్వార్టర్స్ నిర్మించుకుంటామని 2015లో ప్రస్తుత ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండగా లస్కర్లు కోరారు. అప్పట్లో ఆరుగురు లస్కర్లు రూ.20 లక్షలు ఖర్చుపెట్టి బరంతు సైతం చేయించారు. సమీప సరిహద్దుదారుడు కోర్టును ఆశ్రయించడంతో లస్కర్లకు భూ కేటాయింపు జరగలేదు. అనంతర కాలంలో కైకలూరు నుంచి ఆచవరం టర్నింగ్ వరకు ఇరిగేషన్ భూమిని చాలా మంది ఇష్టానుసారం అక్రమించుకుంటున్నారు. తమ శాఖ భూములను తమ క్వార్టర్స్ కోసం కేటాయించాలని పేరు చెప్పడానికి ఇష్టపడని కింద స్థాయి ఇరిగేషన్ సిబ్బంది కోరుతున్నారు.

హెచ్చరించినా పట్టించుకోవడం లేదు



నియోజకవర్గంలో ఇరిగేషన్ భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారు. ముందే హెచ్చరిస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. హెచ్చరిక బోర్డులు పెడుతున్నా లెక్కచేయడం లేదు. ఇటుకల బట్టీల వద్ద ఇరిగేషన్ భూమి ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగిస్తాం.
– శిరీష, ఇరిగేషన్ డీఈ, కైకలూరు

అక్షరమే ఆయుధం

పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే..



జర్నలిస్టు భావ ప్రకటనా స్వేచ్ఛను అగణదొక్కడానికి కేసులు పెట్టడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పత్రికా విలేకరులను భయభ్రాంతులకు గురిచేయడానికి ఫొటో జర్నలిస్టులపై సైతం కేసులు పెట్టడం దుర్మార్గం. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించకూడదనే జర్నలిస్టులపై కేసులు పెట్టేలా పోలీసులను ప్రోత్సహించడం బాధాకరం. పత్రికా రంగం విలువలు, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలి.

–ఈద జాషువా, వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి, భీమవరం

పత్రికలపై కేసులు అన్యాయం



ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే పత్రికలపై కేసులు పెట్టడం అన్యాయం. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎడిటర్ స్థాయి వ్యక్తులపై ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాశారని కేసులు పెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వ విధానాలు పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టులా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న పత్రికలను గౌరవించాలి. ప్రభుత్వ విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలి.

– గుంటి ప్రభు, న్యాయవాది, అంబేడ్కర్ యూత్ ఫోర్స్, రాష్ట్ర అధ్యక్షుడు, భీమవరం

క్లుప్తంగా

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు



పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ఆగిరిపల్లి : డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తూ ఓ ప్రైవేట్ స్కూల్ బస్ పంటబోదెలోకి దూసుకువెళ్లింది. అదృష్టవశాత్తూ బస్సులోని విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం ఈదర నుంచి విద్యార్థులను ఎక్కించుకుని ఆగిరిపల్లికి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సు వస్తుంది. ఈదర అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో బస్సును అదుపు చేయలేకపోయాడు. దీంతో పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది విద్యార్థులను గ్రామస్తులు బయటకు తీశారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా ఎంఈఓ-1 హేబేలు మాట్లాడుతూ స్కూల్ బస్ ప్రమాదానికి గల కారణాలను విచారించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

23న జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 23వ తేదీన ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాల్లో క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే అలివేలు మంగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అండర్ జూడో, హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు స్థానిక ఇండోర్ స్టేడియంలో, బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు కొవ్వలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు విధిగా జిల్లా స్థాయి ఎంట్రీ ఫారాలను తాము చదువుతున్న స్కూల్ / కాలేజ్ ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాల్ సంతకాలతో అందజేయాలని, లేని పక్షంలో ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అనర్హులన్నారు. వివరాలకు 90308 94311 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

యువతిని మోసగించిన దివ్యాంగునిపై కేసు

అత్తిలి: దివ్యాంగురాలిని పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసగించిన దివ్యాంగునిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తిలికి చెందిన బడేటి మోహన్ మురళి అనే దివ్యాంగుడికి, ఓ దివ్యాంగురాలికి మధ్య పరిచయం ఏర్పడింది. సర్టిఫికెట్ల విషయంలో ఫిర్యాదికి అతడు సహాయం చేస్తూ ఉండేవాడు. అతడు తన అవసరాల నిమిత్తం అప్పుడప్పుడు ఆమెనుంచి దఫదఫాలుగా సుమారు రూ.2.50 లక్షలు తీసుకున్నాడు. ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి ఆమెను శారీరకంగా అనుభవించి అనంతరం ముఖం చాటేయడంతో దివ్యాంగురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.ప్రేమరాజు తెలిపారు.

టెంపుల్ జాగా.. ప్రైవేట్ పరం దిశగా

- ప్రైవేటీకరణకు సిద్ధంగా ఏపీటీడీసీ యూనిట్లు
- అందులో ద్వారకాతిరుమల కొండపైన హరిత హోటల్ ఒకటి
- పర్యాటకుల సౌకర్యార్థం 23 ఏళ్ల క్రితం హోటల్ నిర్మాణానికి.. స్వల్ప ధరకు భూమిని విక్రయించిన శ్రీవారి దేవస్థానం
- ఇప్పుడు భవనంతో పాటు ప్రైవేట్ పరం కానున్న గోవిందుడి భూమి
- ప్రైవేట్‌కి ఇస్తే క్షేత్రానికి ముప్పు.. ఆపై సామాన్యులకు ఇబ్బందులు



ద్వారకాతిరుమల కొండపైన హరిత హోటల్



హోటల్ వెనుక రూ. కోటితో నిర్మించిన కల్యాణ మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలనే మంచి ఉద్దేశ్యం, లక్ష్యంతో రెండు దశాబ్దాల క్రితం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు అతి తక్కువ ధరకు విక్రయించిన కోట్లాది రూపాయల విలువైన భూమి ఇప్పుడు ప్రైవేట్ పరం కానుందా.. అంటే అవుననే చెప్పాలి. ఎందుకంటే రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) యూనిట్లను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోంది. దాంతో ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై ఉన్న హరిత హోటల్, అది ఉన్న భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనుంది. అదే జరిగితే గోవిందుడి భూమిలో ప్రైవేట్ వ్యాపారం జరగడం ఖాయం. వివరాల్లోకి వెళితే. టెంపుల్ టూరిజంలో భాగంగా శ్రీవారి దేవస్థానం సుమారు 2 ఎకరాల భూమిని 23 ఏళ్ల క్రితం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు విక్రయించింది. ప్రభుత్వ సంస్థ కావడం, భక్తులకు సౌకర్యాలు కలుగుతాయన్న ఉద్దేశ్యంతో అప్పట్లో నామమాత్రపు ధరకు భూమిని దేవస్థానం అమ్మింది.

కోటిన్నరతో హోటల్ నిర్మాణం..

సుమారు రూ.1.50 కోట్లతో నిర్మించిన ఈ హోటల్‌ను 2002 డిసెంబర్ 19న ప్రారంభించారు. పర్యాటకులు, సామాన్య భక్తులు ఈ హోటల్‌లోని గదులు, రెస్టారెంట్, ఫంక్షన్ హాల్‌ను వినియోగిస్తున్నారు. అయితే 7 ఏళ్ల క్రితం టీడీపీ హయాంలోనే ఈ హోటల్‌తో పాటు, మరికొన్ని హోటళ్లను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నించగా, అప్పటి శ్రీవారి దేవస్థానం అధికారులు తమ భూమిలో ఉన్న హోటల్‌ను తమకే అప్పగించాలని టూరిజం శాఖ అధికారులను కోరారు. దాంతో ప్రైవేటీకరణ అంశానికి తాత్కాలికంగా తెరపడింది. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో తాజాగా ప్రైవేటీకరణ అంశం తెరమీదకొచ్చింది. ఈ సారి ఏకంగా 33 ఏళ్ల లీజుకు ఈ హరితా హోటళ్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం శరవేగంగా జరుగుతోంది.



హోటల్‌లో లగ్జరీ రూము



రెస్టారెంట్

ప్రైవేట్‌కి ఇస్తే.. క్షేత్రాల పవిత్రతకు ముప్పే

ద్వారకాతిరుమల, శ్రీశైలం క్షేత్రాల్లో కొండపై ఉన్న ఈ హరిత హోటళ్లను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడితే సామాన్య భక్తులకు వాటి ధరలు అంబాటులో ఉండవు. అలాగే మద్యం, మాంసాల వినియోగంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలు జరిగి, క్షేత్ర పవిత్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఆలయాల పరిసరాల్లో ఉన్న హరితా హోటళ్లను ఆ దేవస్థానాలకే లీజుకు ఇచ్చి, వాటి నుంచి ప్రభుత్వం ఆదాయాన్ని పొందాలని పలువురు అంటున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన..

రాష్ట్ర వ్యాప్తంగా హరితా హోటళ్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, రోజువారీ పద్ధతిన 1,300 మంది పని చేస్తున్నారు. హోటళ్లను ప్రైవేటీకరణ చేస్తే దాదాపు 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇప్పటికే రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీకి, ఎండీ అమ్రపాల్‌కు అర్జీలను అందించారు. అలాగే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మద్దతు కోరారు. టూరిజం ఉద్యోగులు గురువారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి

స్థానిక హరిత హోటల్లో 8 డీలక్స్, 8 ఏసీ స్టాండర్డ్, 2 నాన్ ఏసీ రూములు, ఒక రెస్టారెంట్, మినీ ఫంక్షన్ హాల్ ఉండేది. వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఆ నిధులతో ఏడాదిన్నర క్రితం హోటల్లో అన్ని సౌకర్యాలను సమకూర్చారు. క్షేత్రంలో కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ ఉండటంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి, ఒక పెద్ద ఏసీ ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. ఇప్పుడు ప్రైవేటీకరణ చేస్తే రూ. 3 కోట్లు ఖర్చు వృథా అయినట్టే.

ఈవో వివరణ

కొండపైన దేవస్థానం స్థలంలో టూరిజం హోటల్ నిర్మించి, అభివృద్ధి చేశారని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి వివరణ ఇచ్చారు. అయితే అప్పట్లో ఆ స్థలాన్ని టూరిజం శాఖకు ఎంతకు విక్రయించారు, ఏమి జరిగిందనే విషయాలను తాను కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు.

ప్రభుత్వంలోనే ఉండాలని..



మేము ప్రభుత్వంలోనే ఉండాలని కోరుకుంటున్నాం. హరిత హోటళ్లు, రిసార్ట్స్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నారని తెలిసి ఇప్పటికే మా ఉన్నతాధికారులను కలిశాం. మాకు ఏ ఇబ్బంది ఉండదని చెప్పారు. ద్వారకాతిరుమల హరిత హోటల్‌లో 9 మంది పనిచేస్తున్నాం. నేను 20 ఏళ్ల క్రితం నుంచి పనిచేస్తున్నాను.

– పి.అచ్యుతకుమార్, హరిత హోటల్ కాంట్రాక్ట్ ఉద్యోగి, ద్వారకాతిరుమల

చంద్రబాబే ప్రైవేట్ మనిషి



సీఎం చంద్రబాబే ప్రైవేట్ మనిషి. ఆయనకు కావాల్సిన వారికి టూరిజం హోటళ్లు, రిసార్ట్స్‌లను తక్కువ లీజుకు కట్టబెట్టేందుకు చూస్తున్నారు. టెంపుల్ టూరిజంను ఎప్పుడూ ఆదాయ వనరుగా చూడకూడదు. పర్యాటకుల సౌకర్యాల కల్పనపైనే దృష్టి పెట్టాలి. హోటళ్లు, రిసార్ట్స్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఇంక టూరిజం శాఖ దేనికి, దానికి మంత్రి, అధికారులు ఎందుకు. కొండపైన ప్రైవేట్ వ్యక్తులకు హోటళ్ల నిర్వహణ అవకాశాలు కల్పిస్తే క్షేత్ర పవిత్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

– పొకలపాటి త్యాగ భీమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం మేధావుల ఫోరం అధ్యక్షుడు

కాటన్ పార్కుకు మోక్షం



ఉప్పుటేరు వంతెన వద్ద కాటన్ పార్కును శుభ్రపరచిన దృశ్యం



గతంలో చిట్టడవిని తలపిస్తున్న కాటన్ పార్కు(పాత చిత్రం)

సాక్షి స్పందన

ఆకివీడు: కొల్లేరు ముఖద్వారంలో ఆకివీడులో ఉన్న కాటన్ పార్కుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల పార్కుకు ఆలనా పాలనా లేకపోవడంతో తుప్పలు, మొక్కలు పెరిగిపోయాయి. పర్యాటక శాఖ నిర్లక్ష్యం ఇందుకు కారణంగా చెప్పవచ్చు. దీనిపై ఈనెల 4వ తేదీన 'చిట్టడవిని తలపిస్తున్న కాటన్ పార్కు' శీర్షికన కథనం ప్రచురించింది. అనంతరం పార్కు అభివృద్ధికి, మొక్కల తొలగింపు తదితర పనులకు రూ.2.80 లక్షలకు దుంపగడప గ్రామస్తుడు పిన్నమరాజు శ్రీనివాసరాజు కాంట్రాక్టు తీసుకున్నారు. ప్రస్తుతం పార్కులో మొక్కల తొలగింపు, తదితర పనులు చేపట్టారు. మరిన్ని నిధులు కేటాయించి విద్యుత్, మంచినీటి సౌకర్యంతో పాటు ఇరత్రా అభివృద్ధి పనులు చేపడితే పర్యాటకులు మరింత పెరిగి ఈ ప్రాంతానికి ఆదాయం చేకూరే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

పలు కేసుల్లో నిందితుల అరెస్ట్

- చోరీ సొత్తు రికవరీ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్, చిత్రంలో ఏఎస్పీ, ఏలూరు డీఎస్పీ

ఏలూరు టౌన్: జిల్లా వ్యాప్తంగా పలు కేసులను పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈమేరకు గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

బంగారు ఆభరణాల కోసం దాడి

ఏలూరు శివారు వట్లూరు ప్రాంతంలో సింగంశెట్టి మల్లేశ్వరమ్మ కిరాణాషాపు నిర్వహిస్తోంది. ఆమె ముందువైపు ఇంటిలో పెనుగొండకు చెందిన సిద్దాని నాగదుర్గాభవానీ, నాగరాజు దంపతులు నివసిస్తున్నారు. మల్లేశ్వరమ్మ మెడలోని బంగారు నాన్‌తాడు, నల్లపూసల తాడును కాజేసేందుకు ఈ దంపతులు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన గంగులూరి రవితేజ, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన సింగులూరి సురేష్ అలియాస్ సన్నీతో పథకం రచించారు. ఈనెల 14న సాయంత్రం రవితేజ మల్లేశ్వరమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమె మెడలోని బంగారు నాన్‌తాడు లాక్కునేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించి గట్టిగా కేకలు వేస్తూ ఉండడంతో చాకుతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. దీనిపై ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం మూడు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు రవితేజ, నాగదుర్గాభవానీ, నాగరాజు, సురేష్ కారులో ఏలూరు మినీబైపాస్ వైపునుంచీ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ ఉండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, రెండు పల్సర్ మోటారు సైకిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్

తన మోటార్‌సైకిల్ దొంగిలించారని గణపవరంలో బొట్ట శివకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు నిడమర్రు సీఐ ఎన్.రజనీకుమార్ ఆధ్వర్యంలో గణపవరం ఎస్సై ఏ.మణికుమార్ కేసును విచారణ చేపట్టారు. ఈకేసులో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన జక్కుల ప్రభుకుమార్‌ను అరెస్ట్ చేయగా... అతనికి వరసకు తమ్ముడైన గణపవరం సంతమార్కెట్ ప్రాంతానికి చెందిన జక్కుల శివకుమార్ జువైనల్ కావటంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.3,55,000 విలువైన 5 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆరు మోటార్‌సైకిళ్లు స్వాధీనం

ఏలూరు ఆటోనగర్‌లోని జనతా గ్యారేజ్ మెకానిక్‌షాపులో పల్సర్ మోటారు సైకిల్ అపహరణకు గురికావటంతో బాధితుడు కొండల రమేష్ ఏలూరు రూరల్ పోలీసులకు ఆగస్ట్ 26న ఫిర్యాదు చేశాడు. ఏలూరు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై బీ.నాగబాబు విచారణ చేపట్టారు. ఈనెల 17న పోలీసులు ఆశ్రం సర్కిల్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా భీమడోలుకు చెందిన మండపతి జీవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులను ఛేదించిన ఎస్సై నాగబాబు, వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా, ఏఎస్సై అహమ్మద్, కానిస్టేబుళ్లు నాగార్జున, నాగరాజు, మోహన్‌ను ఎస్పీ అభినందించారు

ఓఎల్ఎక్స్‌లో చూసి బైక్ కొనేందుకు వచ్చి..


కలిదిండి గ్రామానికి చెందిన తలారి జాస్పర్ కిరణ్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 మోటారు సైకిల్‌ను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పోస్ట్ పెట్టాడు. ఒక వ్యక్తి మోటారు సైకిల్ కొనుగోలు చేసేందుకు వచ్చి బైక్ ఎలా ఉందో చూస్తానని చెప్పి గురవాయిగూడెం గ్రామ శివారు, మద్వానిగూడెం ఊరు చివరకు తీసుకువెళ్లి కిరణ్‌ను కత్తితో బెదిరించి మోటారు సైకిల్‌తో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కలిదిండి ఎస్సై వీ.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రూ.5,40,000 విలువైన 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్సీలకు అందని ఆహ్వానం

భీమవరం (ప్రకాశం చౌక్): జిలాల్లో ప్రముఖ ఆలయాల్లో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికల్లో ఎమ్మెల్సీల ఫొటో, పేర్లు ప్రస్తావించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికల్లో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలకు స్థానం ఇవ్వాలి. కానీ ఆయా ఆహ్వాన పత్రికల్లో ఎమ్మెల్సీల ఫొటోలు గానీ, కనీసం పేర్లు గాని ముద్రించలేదు. భీమవరం మావుళ్ళమ్మ దేవస్థాన దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ఫొటో ముద్రించగా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, పేరాబత్తుల రాజశేఖరం గురించి ప్రస్తావించలేదు.

తప్పుల తడకగా ఆహ్వాన పత్రిక

పంచారామ క్షేత్రం దసరా ఆహ్వాన పత్రిక పూర్తిగా తప్పుల తడకలుగా ఉంది. ఈ ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్సీలు బొర్ర గోపి మూర్తి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, పేరాబత్తుల రాజశేఖరం పేర్లు వేయలేదు. ఇక దేవాదాయశాఖ ఉన్నత అధికారులకు లేని హోదాలను కల్పించేశారు. దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రం మోహన్ ఐఏఎస్ కాకున్నా ఆయన పేరు చివర ఐఏఎస్‌ను చేర్చారు. దేవాదయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేరును ఆనం రామ్‌నారాయణరెడ్డిగా ముద్రించారు. ఈవోల నిర్లక్ష్య వైఖరికి ఈ ఆహ్వాన పత్రిక నిదర్శనంగా నిలుస్తోంది.



మావుళ్ళమ్మ దేవస్థానం ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, పాందువ శ్రీను లేని దృశ్యం



పంచారామ క్షేత్రం దసరా ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్సీలు గురించి ప్రస్తావించని వైనం

పనులు లేక స్వర్ణకారులు విలవిల

ఆకివీడు: బంగారం ధరలు మాత్రం రోజురోజుకీ పెరిగిపోతుంటే.. అవి తయారుచేసే స్వర్ణకారులు మాత్రం పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగారు ఆభరణాలు తయారు చేయించుకునేవారి సంఖ్య క్రమేపీ తగ్గుతుండడంతో ఏళ్ల తరబడి బంగారం వస్తువుల తయారీపై జీవనాధారం పొందుతున్న స్వర్ణకారులు పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల బంగారం 10 గ్రాముల ధర రూ. 1.10 లక్షల వరకూ ఉంది. దీంతో బంగారం కొనేవారి సంఖ్య తగ్గిపోయింది. అత్యవసరమై బంగారు వస్తువులు కొనుగోలు చేసేవారు రెడీమేడ్ ఆభరణాలకు వెళ్లిపోతున్నారు. బంగారు ఆభరణాల విక్రయాల్లో కార్పొరేట్ సంస్థల దూకుడు అధికంగా ఉంది. ఇతర బంగారు షాపుల వారు కూడా వస్తువుల్ని తయారు చేయించకుండా, రెడీమేడ్‌లో తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. దీంతో స్వర్ణకారులకు పనులు లేకుండా పోయాయి. దీంతో చేసేదిలేక కొందరు ఇతర వృత్తులకు వెళ్లినా, వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారి పరిస్థితి మాత్రం మరీ దుర్భరంగా ఉంది.



స్వర్ణకార వృత్తి చేస్తున్న కార్మికుడు

20 శాతం పనులు స్వర్ణకారులకే అప్పగించాలి

కార్పొరేట్, ఇతర సంస్థలు, దుకాణాదారులు విక్రయించే బంగారు ఆభరణాల్లో 20 శాతం స్వర్ణకారులతోనే తయారుచేయించే విధంగా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని స్వర్ణకారులు కోరుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ఇతర ప్రధాన దేవాలయాల్లో బంగారు ఆభరణాల తయారీ స్వర్ణకారులకే అప్పగించాలంటున్నారు. స్వర్ణకారులకు పనులు కల్పించేవిధంగా ప్రభుత్వమే ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు. మంగళ సూత్రాలు, మట్టెలు, ఇతరత్రా వివాహాలకు అవసరమయ్యే వస్తువులు స్వర్ణకారులే తయారు చేసి ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని, స్వర్ణకార సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో స్వర్ణకారుల బతుకులు పాతాళానికి వెళ్లాయి. బంగారం వస్తువుల్ని తయారు చేయించుకునే వారు లేక స్వర్ణకార వృత్తిని నమ్ముకున్న వారి పరిస్థితి నట్టేట మునిగినట్లు అయింది. ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలి. ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలి.

– పట్నాల శేషగిరిరావు, స్వర్ణకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆకివీడు

ఉపాధి కల్పించాలి



బంగారం ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం తయారు చేయించుకొనే పరిస్థితి లేదు. దీంతో బంగారం పని లేక, మరే ఇతర పనికి వెళ్లలేక స్వర్ణకారులు అర్థాకలితో జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వం తక్షణం ఉపాధి కల్పించి స్వర్ణకారులను ఆదుకోవాలి.

– నల్లగొండ వెంకట రామకృష్ణ, స్వర్ణకార సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నరసాపురం

కన్నబిడ్డలకు భారం కాలేక ఆత్మహత్యాయత్నం



పాంగుటూరు పంచాయతీ కార్యాలయంలోని బల్లపై కూర్చుని రోదిస్తున్న, రంగమ్మ

కొయ్యలగూడెం: వయస్సు మీద పడింది.. కన్న బిడ్డలకు భారమైంది. తన సంతానం అంటున్న సూటిపోటి మాటలకు కలత చెంది చెరువులోకి దూకి తనువు చాలించేందుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల ప్రకారం పొంగుటూరు గ్రామానికి చెందిన మద్దాల రంగమ్మ (75 ఏళ్లు) వృద్ధురాలి భర్త శేషయ్య మూడేళ్ల కిందట మృతి చెందడంతో కొడుకు శేషారావు వద్ద బతుకీడ్చుతున్నట్లు తెలిపింది. ముగ్గురు కుమార్తెలకు వివాహం చేసి ఎవరి కాపురాలకు వాళ్లను పంపగా, తన వద్ద ఉన్న మూడు ఎకరాల పొలంను కుమారుడికి రాసిచ్చినట్లు పేర్కొంది. తల్లినని కూడా చూడకుండా కొడుకు, కోడలు అనరాని మాటలు అంటూ అవమానాలకి గురి చేస్తున్నారంటూ కన్నీటి పర్యంతమైంది. పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఊర చెరువులోకి దూకడానికి ప్రయత్నిస్తుండగా సర్పంచ్ పసుపులేటి రాంబాబు కాపాడారు. రంగమ్మ కుటుంబ సభ్యులకు కబురు పంపినా స్పందించకపోవడంతో పంచాయతీ కార్యాలయంలోని బల్లపైనే కూర్చుని ఆమె రోదిస్తోంది. ప్రస్తుతానికి వృద్ధురాలి సంరక్షణ పంచాయతీ చూసుకునే విధంగా ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామ పెద్దలు కలగజేసుకొని వృద్ధురాలికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



పైడిపర్రు పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆప్టోమెట్రిస్ట్ ఎం. నాగరాజు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎం.ఏడుకొండలు మాట్లాడుతూ మానవ అవయవాల్లో కన్ను ఎంతో ప్రాముఖ్యమైనదని, కంటిచూపు ఇబ్బందులను నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దిరాజు, రాధాకృష్ణ, ఏసుకృప, రామకృష్ణ, విజయకుమారి, స్వరూపరాణి, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమ్మెకాలపు ఒప్పందాలకు జీఓలను జారీ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ పట్టణ కమిటీ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు గురువారం మునిసిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. మునిసిపల్ కమీషనర్ యేసుబాబుకు వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏపీసీఓఎస్ రద్దు చేసే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 12వ పీఆర్‌సీని ప్రకటించాలని, 17 రోజుల పాటు సమ్మె కాలపు ఒప్పందాలకు జీవో జారీ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా కమిటీ సభ్యులు ఏబీ శ్రీనివాస్, కొడమంచిలి బాబు, అల్లం మంగారావు, సతీష్, దయామణి, నాగమణి, శ్రీను, మణికుమార్, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్యలో ఎంబీఏ తరగతులు ప్రారంభం

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదికవి నన్నయ్య ప్రాంగణంలో గురువారం ఎంబీఏ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి గ్లోబల్ మార్కెట్‌లో ఎంబీఏ విద్య ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఈ విద్య ద్వారా ఉద్యోగ అవకాశాలు, ఉన్న విస్తృత అవకాశాలు గురించి వివరించారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎం.ఎస్.ఎస్.అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి



అత్తిలి తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఆర్ఏలు

అత్తిలి: వీఆర్ఏల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వీఆర్ఏల సంఘం మండల నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, పని భారం తగ్గించి అర్హులైన గ్రామరెవెన్యూ సహాయకులకు వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ దశికవంశీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ నాయకులు క్రాంతికుమార్, రేణు, బేబి, రుబీనా, చిట్టికోటిలింగం, సుబ్బారావు, దుర్గ, బాలస్వామి, గంగయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీపీ.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం బాధాకరమన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

గూడెంలో శిథిలమైన పార్కులు

- పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా మారిన పార్కులు
- పాడైన ఆట వస్తువులు
- పార్కులను అభివృద్ధి చేయాలి
- మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు



క్రీడా ప్రాంగణంలో ఆట వస్తువులు



నీటిలో తడుస్తున్న ఆట వస్తువులు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న పార్కు



మునిసిపల్ మరో క్రీడా ప్రాంగణంలో గొలుసులు లేని రాడ్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పిల్లలు ఆడుకునేందుకు వీలైన పార్కులు లేవు. ప్రస్తుతం అన్ని పార్కులన్నీ శిథిలావస్థకు చేరాయి. దాతలు సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన పార్కులు సైతం మూలన పడ్డాయి. ఆట వస్తువులు పూర్తిగా పాడైపోయాయి. పార్కుల నిండా చెత్త చెదారాలు, పిచ్చిమొక్కలతో, విష జంతువులకు ఆవాసాలుగా మారి నేడు అస్తవ్యస్తంగా మారాయి. పట్టణానికి అవసరమైన, పిల్లలకు అనువైన పార్కు లేకపోవడం గమనార్హం. అక్కడక్కడ ఉన్న పార్కులైన అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

పాడైన పలు పార్కులు

గతంలో ఏర్పాటు చేసిన గణేష్ నగర్ రోడ్డు చిరంజీవి మునిసిపల్ పార్కులోని ఆట వస్తువులు పూర్తిగా పాడైపోవడంతో ఆ పార్కులోకి పిల్లలు వెళ్లడం లేదు. పీ అండ్ టీ కాలనీలో ఏర్పాటు చేసిన వాసవి క్లబ్ పార్కు పూర్తిగా ధ్వంసమైంది. రాకెట్ పార్కును ప్రస్తుతం చిన్నపాటి జిమ్‌ను ఏర్పాటు చేశారు. అది స్త్రీలకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఎన్నో ఇతర చిన్న చిన్న పార్కులు కాల గర్భంలో కలిసిపోయాయి.

7వ వార్డులో పార్కులు

ఇది ఇలా ఉంటే అనంతర కాలంలో పట్టణంలోని 7వ వార్డులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మునిసిపల్ రిజర్వ్ సైట్‌లో దాతల సహాయ సహకారాలతో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. దీంతో చుట్టు ప్రక్కలవారు, పరిసర ప్రాంతాలకు చెందిన చిన్న పిల్లలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆట విడుపుగా ఆ క్రీడా ప్రాంగణంలో ఆడుకుంటున్నారు. ప్రస్తుతం ప్రాంగణంలోని క్రీడా పరికరాలు పాడైపోయాయి. పట్టించుకునే వారే లేరు.

మరో పార్కులో పాడైన ఆట వస్తువులు

అదే విధంగా ఇదే వార్డులో సమీపంలోని మరో మునిసిపల్ పార్కులో సైతం క్రీడా పరికరాలను ఊయలలు, క్లైంబర్ ఏర్పాటు చేశారు. అయితే ఊయలలకు సంబంధించిన ఆధారాలు (రాడ్‌లు) ఉన్నప్పటికి ఊయల ఊగేందుకు వీలుగా ఇనుప గొలుసులు, కూర్చునేందుకు సీట్లు లేపోవడంతో ప్రస్తుతం ఆ పార్కు నిరుపయోగంగా మారింది.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరికరాలు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 7వ వార్డులోని పార్కులో స్వింగ్‌లు (ఊయలలు), స్లయిడ్‌లు (జారుడు బల్లలు), శాండ్ బాక్స్, సీసా, మంకీ బార్స్, సెట్ క్లైంబర్స్, స్ప్రింగ్ రైడర్స్, స్పినర్లు వంటివి ఉపకరణాలు ఏర్పాటు చేశారు. అయితే ఇందులో కొన్ని పూర్తిగా పాడైపోయాయి. తప్పు పట్టాయి. మరి కొన్ని బాగు చేయాల్సి ఉంది.

నీట మునిగిన క్రీడా ప్రాంగణం

7వ వార్డులో లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన ఆట పరికరాలు పాడైనవి కాకుండా ఉన్నవి వినియోగించుకోవడానికి వీలే లేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు కారణంగా పల్లపు ప్రాంతంలో ప్రాంగణం ఉండటంతో ఆ ప్రాంగణం నీట మునిగింది. మురుగునీరు, బురదతో పాటు ఆవరణ అంతా చిత్తడి చిత్తడిగా మారింది. ఆవరణలోకి వస్తే జారే ప్రమాదం ఉంది. ఆ ఆట వస్తువులు నీటలో ఉండటంతో పిల్లలు, విద్యార్థులు, పెద్దలు ఆ ప్రాంతానికి రావడం మానివేశారు. కనీసం పట్టణంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్ క్రీడా ప్రాంగాణాన్ని, ఆట వస్తువులను, మరో మునిసిపల్ పార్కులో ఉన్న క్రీడా పరికరాలను బాగు చేయాలని, అవసరమైతే కొత్తవి రప్పించాలని, ముఖ్యంగా పార్కును మెరక చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మునిసిపల్ అధికారులు పట్టించుకోవాలని, దాతల సహాయ సహకారాలు తీసుకుని పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటలు ఆడుకునేందుకు పార్కులు కావాలి



“సెలవు రోజులలో ఆటలు ఆడేందుకు ఆట వస్తువులు ఉన్న పార్కులు లేవు. 7వ వార్డులోని క్రీడా ప్రాంగణంలో కొన్ని ఆట వస్తువులు పాడైపోయాయి. మరికొన్ని నిరుపయోగంగా మారాయి. ఉన్న పరికరాలు ప్రస్తుతం ఆడుకోవడానికి లేకుండా, ఆవరణలోకి వెళ్లేందుకు వీలు లేకుండా వర్షం నీటితో నిండిపోయింది. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆవరణను అభివృద్ధి చేయాలి. కొత్త ఆట వస్తువులను రప్పించాలి.

కె.నేహశ్రీ, 5వ తరగతి, తాడేపల్లిగూడెం

వెదురు అంటే గ్రీన్‌గోల్డ్



ఉద్యానవర్సిటీలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: వెదురు అంటే గ్రీన్‌గోల్డ్ అని ఉద్యానవర్సిటీ కెవికె వెంకట్రామన్నగూడెంలో గురువారం జరిగిన వరల్డ్ బాంబూ డేలో వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు అన్నారు. ఆయన మాట్లాడుతూ వెదురు పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయం తెస్తుందన్నారు. కాగితం, ఫర్నీచర్, హస్తకళలు, నిర్మాణ రంగం వంటి అనేక రంగాల్లో దీనికి విస్తృతమైన డిమాండ్ ఉందన్నారు. వెదురు మొక్కలు తక్కువ నీరు, ఎరువులతోనే అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచుకోవడమే కాకుండా వాతావరణ మార్పులకు తట్టుకొనే శక్తిని కలిగి ఉంటాయన్నారు. వెదురు పెంపకం వల్ల కార్బన్ శోషణ పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. కెవికె సీనియర్ సైంటిస్టు డాక్టర్ పి.విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు బి.పెదబాబు, ఏ.దేవీవరప్రసాదరెడ్డి, ఇ.రేఖ, కె.అర్చన సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం



తూర్పు విప్పర్రులో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యులు వెలగల లక్ష్మి క్రాంతి రెడ్డి తెలిపారు. తూర్పు విప్పరు గ్రామంలో గురువారం 150మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశా రు. ఈ సందర్భంగా వెలగల లక్ష్మీకాంతిరెడ్డి మాట్లాడుతూ స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు.

జగన్‌ను కలిసిన పలువురు నాయకులు



తాడేపల్లిలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, గుండుమోగుల సాంబయ్య, జద్దు హరిబాబు, శాంతకుమార్ కనుపూరి ఉదయ్ భాస్కర్

తాడేపల్లిగూడెం రూరల్/ తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు: తాడేపల్లిగూడెంకు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసి వైఎస్సార్ సీపీ జిల్లా స్పోక్స్ పర్సన్ ముప్పిడి సంపత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జద్దు హరిబాబు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కనుపూరి ఉదయ్‌భాస్కర్,సిర్రాపు శాంతకమార్, పెంటపాడు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు గుండుమోగుల సాంబయ్య, దర్శిపర్రుకు చెందిన పార్టీ నాయకులు గుండుమొగుల మునీంద్రలు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానంతరం ఆయన చాంబరులో కలిసి రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు వివరించారు.

వృక్ష విలాపం



కూల్చిన చెట్లు



రోడ్డు పక్కన పడేసిన కొమ్మలు

- ఇష్టానుసారంగా చెట్ల నరికివేత
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. జంగిల్ క్లియరెన్స్ పేరిట కొమ్మలు తొలగించాల్సిన విద్యుత్ అధికారులు, సిబ్బంది కొన్ని చట్ల ఏకంగా మోళ్ల చేసేస్తున్నారు. ఇక నివాసీయులు, షాపుల వాళ్లు కూడా ముందు ఉన్న చెట్లను ఎడపెడా నరికేస్తున్నారు. చెట్లను నరికేయడం దారుణమైన చర్య అని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు.

యువత తీరుపై విమర్శలు

పట్టణంలోని స్థానిక పాతూరు 12వ వార్డులో దసరా ఉత్సవాలకు సంబంధించి చెట్టు కొమ్మలు అడ్డంగా ఉంటున్నాయనే నెపంతో ఎన్నో సంవత్సరాలుగా నీడ నిచ్చే చెట్లను నరికేసారు. పట్టణ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు పెంచిన మొక్కలను ఈవిధంగా తుంచేయడంపై పర్యావరణ ప్రేమికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్లు తొలగింపు ప్రయత్నం ప్రారంభంలోనే సంబంధిత మునిసిపల్ అధికారులకు తెలియజేసినప్పటికి ఎవరూ అడ్డుకోకపోవడం విశేషం. ఈ క్రమంలో యువత విద్యుత్ కోత మిషన్‌లు ఉపయోగించి రెండు చెట్లు ప్రధాన కొమ్మలను నరికివేసి మొద్దులను మాత్రమే మిగిల్చారు. ఈ క్రమంలో చెట్లు కొమ్మలు విరిగిపడిపోవడంతో ఇళ్లకు వెళ్లే విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. చెట్లు కొమ్ములను, ఆకులను, మొద్దులను రోడ్డు పక్కనే పడేసి వెళ్లిపోయారు. అదే విధంగా అక్కడ సమీపంలో ఉన్న పార్కు చుట్టూ ఉన్న కొన్ని చెట్లును సైతం నరికివేశారు. అడిగే వారు లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పర్యావరణంను పరిరక్షించాలంటూ ప్రభుత్వం చేస్తున్న మాటలు నీటి రాతలుగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చెట్లను తొలగించకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా కమీషనర్ నోటీస్‌లో ఉంచుతామని వివరించారు.

మినుము పంటను వదలొద్దు

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



అప్పారావుపేట గ్రామంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు జ

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు మినుము పంటను వదలొద్దని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో కొత్త రకం మినుము ఎల్‌బీజీ 884, ఎల్‌బీజీ 904 రకం విత్తనాలను రైతాంగానికి పరిచయం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సార్వా సాగు తర్వాత రైతులు ఈ మినుము విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎల్‌బీజీ 884, ఎల్‌బీజీ 904 రకాలు 80 రోజుల మధ్య పంట చేతికొస్తుందన్నారు. దాదాపు ఎకరానికి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. రైతులు తమ పొలంలో కొంత భాగంలో ఈ మినుము పంటను సాగు చేయాలన్నారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్లాకు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నత్రజని వాడకాన్ని నివారించాలన్నారు. సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి నారాయణరావు, నాయకులు కట్టా జానకీరామయ్య, నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



తిరుపతిపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యమని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. గురువారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో పోషణ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ రోజు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని, నూనె శాతాన్ని, పంచదార వాడకాన్ని తగ్గించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజు ఆధ్వర్యంలో కిశోర బాలికలకు ఎత్తులు, బరువులు, రక్త శాతం స్క్రీనింగ్ చేశారు.

బీఐఎస్ సమావేశానికి ఎన్నికైన నల్లి పోశియ్య

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలకు చెందిన జీవశాస్త్ర అధ్యాపకుడు ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సమావేశంలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఇటీవల ప్రతిష్టాత్మకంగా జరిగిన జీ 20 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 100 దేశాల ప్రతినిధులు పాల్గొనే 59వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమీషన్ జనరల్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు ఏపీ ప్రతినిధిగా పోశియ్యకు విజయవాడ బీఐఎస్ నుంచి ఆహ్వానం అందింది. ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన ప్రగతిని గూర్చిన అవగాహన పొందేందుకు గాను ఈ అరుదైన అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు పోశియ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ లైన్స్ మరమ్మతుల నిర్వహణలో భాగంగా ఈనెల 20వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని ఐక్య నగర్, హౌసింగ్ బోర్డు, అయ్యప్పస్వామి ఆలయ ప్రాంతం, డీమార్ట్, కొండాలమ్మ పుంత, పెరవలి జాతీయరహదారి, మాతృశ్రీ లే అవుట్, రామకృష్ణ మఠం, సజ్జాపురం, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లోను, రూరల్ పరిధిలో ఇందిరా నగర్, తేతలి ఇండస్ట్రియల్ ఏరియా, సూర్యప్రభ ఇండస్ట్రియల్ ఎస్టేట్, తేతలి హౌసింగ్ కాలనీ, వడ్లూరు, చివటం, సూర్యారావుపాలెం, దువ్వ, కోనాల ముద్దాపురం గ్రామాల్లోను, అత్తిలి మండల పరిధిలో గణేష్ చౌక్, మసీదు రోడ్డు, గానుగుల వీధి, పాత సబ్ రిజిస్టర్ కార్యాలయ ప్రాంతం, కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సీహెచ్ చెరువు గ్రామాల్లోను, ఇరగవరం మండల పరిధిలో ఇరగవరం, హనుమాజీపాలెం, వేంద్రవారిపాలెం, చినరాముని చెర్వు, గొల్లగుంటవారిపాలెం, గొల్లమాలపల్లి, కంతేరు, కొత్తపాడు, కత్తవపాడు, పాదలాడ, కాకిలేరు, పేకేరు, అయితంపూడి, ఏలేటిపాడు, అయినపర్రు, అర్జునుడుపాలెం, కాకిలేరు, పేకేరు, ఓగిడి, పెద్దిరెడ్డిపాలెం, తూర్పు విప్పర్రు, కేకేవల్లి, ఆర్ ఖండ్రిక, నారాయణపురం, గోటేరు, యర్రాయిచెర్వు, గోపాలపురం, కేతావారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వన్‌టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వన్ టౌన్‌లో 33/11కేవీ పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 20వ తేదీ జెడ్పీహెచ్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వన్ టౌన్‌లోని కె.ఎన్.రోడ్డు, మసీదు రోడ్డు, పాతూరు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. పట్టణంలోని టూ టౌన్‌లోని యాగర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ పడాల, 11కేవీ యాగర్లపల్లి, 11కేవీ కొబ్బరితోట, 11 కేవీ జట్లపాలెంలకు సంబంధించి ఈ నెల 20వ తేదీ కె.పెంటపాడు న్యూసబ్‌స్టేషన్ ఏబీ స్విచ్స్, వివిధ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. టూ టౌన్ పరిధిలో పడాల, పడాల గురువు, ముత్యాలంభపురం, యాగర్లపల్లి ఏరియా, కొబ్బరితోట, జట్లపాలెంలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలికలను ఉన్నతంగా చదివించాలి



జగన్నాథపురం సచివాలయం-1 వద్ద పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలను ఉన్నత చదువులు చదివించాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జగన్నాథపురం సచివాలయం-1లో స్థూలకాయ నివారణ, పోషణ్ బీ పడాయి బీ, ఐవైసీఎఫ్, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు, పిల్లల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రిక మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే భావితరాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే బాలికలకు సరైన పోషణ అందజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పాలు, గుడ్లు, బాలామృతం వంటి వాటిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డాక్టర్ సింధు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, కొండ్రుప్రోలు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పరీక్షలు చేశారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.